చురుగ్గా పంట నష్టం వివరాల నమోదు

మునగపాక : మండలంలో పలు గ్రామాల్లో తుపాను పంట నష్టం అంచనా వివరాల నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ఇటీవల సంభవించిన తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేస్తున్నారు. ఎంత విస్తీర్ణంలో వరికి నష్టం జరిగిందనే విషయమై అధికారులు నిర్ధారిస్తూ వివరాలు రికార్డు చేస్తున్నారు.

పశు మాంసం స్వాధీనం

పాయకరావుపేట: జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న 13 టన్నుల పశు మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.జోగారావు శనివారం తెలిపారు. స్థానిక పి.ఎల్.పురం జంక్షన్ వద్ద తుని వైపు వెళ్తున్న వ్యాన్‌ను తనిఖీ చేయగా, పశు మాంసాన్ని గుర్తించామన్నారు. దీన్ని పశువైద్యాధికారితో పరీక్షించగా, ఆవు, గేదె మాంసంగా నిర్ధారించారన్నారు. అక్రమంగా పశుమాంసం రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

జగన్నాథరావుకు అభినందన



జగన్నాథరావుతో సర్పంచ్ అరుణలత , గ్రామ నాయకులు

రాంబిల్లి: వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎంపికైన వానపల్లి జగన్నాథరావును శనివారం కొత్తపేట సర్పంచ్ అరుణలత , గ్రామ నాయకులు అభినందించారు. తనకు పదవి ఇచ్చిన జగనన్నకు రుణపడి ఉంటానని, చేనేత రంగ అభివృద్ధికి కృషి చేస్తానని జగన్నాథరావు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీతో అభివృద్ధి సాధ్యమని మరోసారి జగనన్నను గెలిపించాలని కోరారు.

సీఐ బుచ్చిరాజు బాధ్యతల స్వీకరణ



అచ్యుతాపురం: అచ్యుతాపురం సీఐగా ఎం.బుచ్చిరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటి వరకూ సీఐగా బాధ్యతలు మురళీరావు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బుచ్చిరాజు అచ్యుతాపురం సీఐగా విధుల్లో చేరారు.

అంగన్‌వాడీలపై టీడీపీది సవతి తల్లిప్రేమ

- గతంలో ఆందోళన చేస్తే గుర్రాలతో తొక్కించారు
- ఇప్పుడు మద్దతు పలకడం సిగ్గుచేటు
- కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం

నక్కపల్లి: అధికారంలో ఉన్నపుడు తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలను గుర్రాలతో తొక్కించడం, పోలీసుల సాయంతో లాఠీచార్జీలు చేయించి ఈడ్చించిన ఘనత టీడీపీదేనని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. ఇప్పుడు వారిపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని వారి చేసే ఆందోళనకు మద్దతు ఇచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆయాలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వెయ్యి రూపాయల వేతనాన్ని పెంచడం జరిగిందన్నారు. అంగన్‌వాడీల న్యాయపరమైన డిమాండ్లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని, జగనన్న ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు పూర్తి న్యాయం చేస్తుందన్నారు. అయితే ఎన్నికల ముందు వీరు చేస్తున్న ఆందోళనను రాజకీయం చేయాలని ప్రతిపక్షాలు ప్రయత్నం చేస్తున్నాయన్నారు.ఇన్నాళ్లు వీరి డిమాండ్లపై నోరు మెదపని టీడీపీ, కమ్యూనిస్టులు వారు రోడ్డెక్కగానే తగుదునమ్మా అంటూ సంఘీభావం ప్రకటించం రాజకీయ కుట్రలో భాగమేనన్నారు. ప్రతిపక్షాల ఉచ్చులో అంగన్‌వాడీ సిబ్బంది పడొద్దని విజ్ఞప్తి చేశారు.

ప్రయోగాత్మక కార్యక్రమాలపై విద్యార్థులను ప్రోత్సహించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : ప్రయోగాత్మక కార్యక్రమాలపై ఆసక్తి కనబరిచే విద్యార్థులను మరింత ప్రోత్సహించి ప్రయోగాల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 15 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల వ్యక్తిగత కేటగిరిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగరాజుపాలెం ప్రథమ స్థానంలో నిలువగా, కొరుప్రోలు ద్వితీయ స్థానంలో నిలిచింది. విద్యార్థులు గ్రూప్ కేటగిరిలో ఎస్.రాయవరం ప్రథమ స్థానం, దార్లపూడి ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రోత్సాహక ధ్రువీకరణ పత్రాలతో పాటు మెమెంటోలు అందజేశారు. ఉపాధ్యాయుల కేటగిరిలో కొరుప్రోలు ప్రథమ స్థానంలో నిలవగా ధర్మవరం అగ్రహారం ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఎంఈవో మూర్తి, ప్రధానోపాధ్యాయులు ఎస్.సత్యనారాయణ, నోడల్ ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాసరావు,రమేష్ పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంచేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు అన్నారు. శనివారం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు.

ప్రజా రంజక పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యం



గణపర్తిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక : ప్రజారంజక పాలన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని గణపర్తిలో వలంటీర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించాలన్నారు. గత ప్రభుత్వానికి, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి తేడా గమనించి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ చదరం నాయుడు, సచివాలయ కన్వీనర్ అప్పలనాయుడు, కాండ్రేగుల సీతారామ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాయకరావుపేట : రాష్ట్రం అన్ని రంగాల్లోను అభివృద్ధి చెందడం కోసమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు లంక సూర్యానారాయణ అన్నారు. పాల్తేరు గ్రామంలో గల ఒకటో నంబరు సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు స్వయంగా లబ్ధిదారులు, అర్హులు బ్యాంకు ఖతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. పథకాలు అమలు జరగాలంటే మరలా రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డినే మనందరం గెలిపించుకోవాలన్నారు. అనంతరం సచివాలయ పరిధిలో సంక్షేమ వివరాలతో డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. పార్టీ సీనియర్ నాయకుడు సూర్యచక్రం, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీను, సర్పంచ్ కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు సత్యానారాయణ, వైస్ ఎంపీపీ స్వామి, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం

యలమంచిలి: జంపపాలెం, కొత్తపాలెం గ్రామంలో గౌరీపరమేశ్వరుల సారె మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రెండు గ్రామాల్లో రాత్రి గౌరీ పరమేశ్వరులను రకరకాల పిండివంటలు తయారు చేసి పసుపు కుంకుమ చీర, రవికలు సమర్పించి పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జంపపాలెం వైస్ ఎంపీపీ ఉమ, మాజీ సర్పంచ్ శ్రీరాములు, వెంకటరెడ్డినాయుడు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని నాగులాపల్లి,చూచుకొండ గ్రామాల్లో శనివారం రాత్రి గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ చూచుకొండలోని గౌరీ పరమేశ్వరులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నాగులాపల్లిలో శనివారం గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు ఘనంగా జరిగింది.

నేడు ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

రాంబిల్లి: దిమిలిలో శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా ఇక్కడ ధనుర్మాస ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. నెల రోజులు పాటు శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి వార్లకు నూతన వస్త్ర అలంకరణ, పుష్పాలంకరణ చేయనున్నట్టు ఆలయ అర్చకులు నేతేటి రామ చంద్రాచార్యులు, నేతేటి గోపాలకృష్ణ తెలిపారు.

విద్యార్థులపైకి దూసుకెళ్లిన బైక్

యలమంచిలి రూరల్: బస్సు దిగి రోడ్డు దాటుతున్న ఇద్దరు విద్యార్థులపైకి మోటారు బైక్ దూసుకెళ్లిన ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా మరో విద్యార్థి స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు తెలియజేసిన వివరాలివి. అనకాపల్లి నారాయణ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బొడ్డు మదన్(17) మరో విద్యార్థి ఎరకన్న కళాశాల నుంచి తిరిగి వస్తూ స్వగ్రామం పురుషోత్తపురంలో బస్సు దిగి ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాతుతుండగా యలమంచిలి వైపు వేగంగా వస్తున్న మోటారు బైకు ఢీకొట్టింది. దీంతో విద్యార్థి మదన్ ఎడమ చేయి విరగగా, మరో విద్యార్థికి స్వల్పంగా గాయాలయ్యాయి.

హరిపాలెం విద్యార్థుల ప్రతిభ



క్రీడల్లో రాణించిన వారితో హైస్కూల్ సిబ్బంది

అచ్యుతాపురం : ఈ నెల 10న నంద్యాలలో జరిగిన త్రో బాల్ పోటీల్లో హరిపాలెం ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి కుషన్‌భాస్కర్ సిల్వర్ మెడల్ సాధించారు. నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీలో 9వ తరగతి చదువుతున్న యోగివర్ధన్ లాంగ్‌జంప్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీఈటీ ధర్మిరెడ్డి రాజు తెలిపారు. ఆయా విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి సంతాపం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ సాబ్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



లింగాపురంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న యూటీఎఫ్ సభ్యులు

మునగపాక : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకి మునగపాకలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి సీఐటీయూ నేతలు వి.వి. శ్రీనివాసరావు, ఆళ్ల మహేశ్వరరావు, బ్రహ్మాజీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాబ్జీ మృతి బాధాకరమన్నారు. ప్రజలకు నిస్వార్థమైన సేవలందించే సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం విచారకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, జయలక్ష్మి,అంజలి,తులసి, సరస్వతి,ఉమ,మంగ పాల్గొన్నారు.

కోటవురట్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి యూటీఎఫ్ సభ్యులు సంతాపం తెలిపారు. లింగాపురం ఎంపీపీ స్కూల్‌లో సమావేశమైన యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అవిరామ కృషి చేశారని అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉపాధ్యాయులు జవ్వాది నర్సింగరావు, జె.వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

హిందు ధర్మ పరిరక్షణకు కృషి

మునగపాక : ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర ధర్మ ప్రచారకులు ఆడారి గంగాధర్ కోరారు. మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం మునగపాక పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు.

పరీక్ష కేంద్రం మార్పుపై ఆందోళన

ఎస్.రాయవరం: తమ విద్యార్థులు స్థానిక పాఠశాలలో పరీక్షలు రాసే విధానాన్ని ఎందుకు రద్దు చేశారని, చదువుతున్న పాఠశాల ఉన్న పరీక్ష కేంద్రంలో పరీక్షలకు రాసేందుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు.

నేడు ఇంద్రప్రస్థం నాటక ప్రదర్శన

మునగపాక : మునగపాక నందీశ్వర ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఇంద్ర ప్రస్థం నాటక ప్రదర్శన జరుగుతుందని నందీశ్వర నాట్యమండలి సభ్యులు తెలిపారు. నాటకరంగ దర్శకుడు,విద్యావేత్త స్వర్గీయ మొతికా సాంబశివరావు వర్ధంతి సందర్భంగా గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్‌వారి ఇంద్రప్రస్థం నాటక ప్రదర్శన రాత్రి 7.30గంటలకు జరుగుతుందన్నారు. నాటకానికి గోపి సత్యప్రకాష్ రచన అందించగా రవీంద్రరెడ్డి దర్శకత్వం వహిస్తారన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

నక్కపల్లి : మండలంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది.సుబ్బరామిరెడ్డి కల్యాణమండపంలో జరిగిన ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా వై. కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.అప్పలరాజు, గౌరవాధ్యక్షుడిగా ఎస్. ఫల్గుణరావు ఎన్నికయ్యారు.ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిలర్ పి.గణేష్ వ్యవహరించారు. పరిశీలకుడిగా జిల్లా కార్యదర్శి వై. శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా రాష్ట్ర పూర్వకార్యదర్శి బి. వెంకటపతిరాజు హాజరయ్యారు.

విద్యారంగానికి సీఎం జగన్ పెద్ద పీట

యలమంచిలి: రాష్ట్రంలో విద్యారంగానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని యలమంచిలి మండలం జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి అన్నారు. శనివారం ఏటికొప్పాక గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం పథకం వంట పాత్రలు, విద్యార్థులకు క్రీడాపరికరాలు, గుర్తింపు కార్డులను ఆమె అందజేశారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని వసతులు కల్పించి విద్యనందిస్తున్నారని, అన్నారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మొల్లేటి ప్రసాద్,గ్రామ సచివాలయ కన్వీనర్ వీసం వాసు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ సిబ్బంది పెన్‌డౌన్

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని సర్వశిక్షా అభియాన్ సిబ్బంది కోరారు. స్థానిక ఎమ్మార్సీలో పనిచేస్తున్న ఎస్ఎస్ఏ సిబ్బంది శనివారం నుంచి పెన్‌డౌన్ చేపట్టారు.

తంతడిలో సోలార్ పంపు ప్రారంభం



అచ్యుతాపురం: అచ్యుతాపురం మండలంలోని తంతడి గ్రామంలో శనివారం సౌర విద్యుత్ ఆధారిత పంపును ప్రారంభించారు. రూ.7.5 లక్షలతో ఏర్పాటు చేసే ఈ పంపు సౌర విద్యుత్‌పై ఆధారపడి పనిచేస్తుంది. తద్వారా విద్యుత్ ఆదా ఉంటుందని సర్పంచ్ మురళి తెలిపారు. రాజాన పద్మజా అప్పారావు పాల్గొన్నారు.

సండే క్లాసిఫైడ్స్

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.